క్లుప్తంగా

చిత్తూరులో స్పందన రద్దు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందనను రద్దు చేసినట్లు ఎస్పీ జాషువ, మునిసిపల్ కమిషనర్ అరుణ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్పందనను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చర్చిల్లో విశేష ప్రార్థనలు



మట్టలతో ప్రదక్షిణలు చేస్తున్న క్రైస్తవులు

గుడిపాల: మండలంలో పలు ప్రధాన చర్చిల్లో మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా బిషప్‌లు, పాస్టర్‌లు ఆధ్వర్యంలో విశేష ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బిషప్‌లు గుడ్‌ఫ్రైడే మూడురోజుల ప్రాధాన్యత, పవిత్రత గురించి వివరించారు. ప్రార్థనలనంతరం విశ్వాసులు చేతబూని చర్చిల చుట్టూ క్రీస్తు ధ్యానం చేస్తూ ప్రదక్షిణలు నిర్వహించారు.

సైనిక్ స్కూల్‌కు షమిత్ రెడ్డి



తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరుకు చెందిన హరిబాబు కుమారుడు షమిత్ రెడ్డి సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. షమిత్ రెడ్డి తిరుపతిలోని అక్షరధామం ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 5వ తరగతి చదువుతూ సైనిక్ స్కూల్లో పరీక్ష రాశాడు. అందులో ఆల్ ఇండియా స్థాయిలో 3154 ర్యాంకు సాధించి సైనిక్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యాడు

108 లీటర్ల పాలతో అభిషేకం



గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు 108 లీటర్లతో క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఆదివారం ఉదయం మొదటగా స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గడపగుడిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ విగ్రహాలకు చెన్నైకి చెందిన భాస్కర్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారు తెచ్చిన కలశ కుండలతో 108 లీటర్ల పాలను తీసుకుని రాగా, అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణోత్సవం చిత్తూరు నగరానికి చెందిన సంగీత, వేపంజేరి గ్రామానికి చెందిన పుష్ప చంద్రశేఖర్ రెడ్డి దంపతులు ఉభయదారులుగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి కౌసల్య హరికథా కాలక్షేపం చేయగా అన్నమయ్య కీర్తనలు వేంకటేశ్వర భక్తి గీతాలను లక్ష్మీరాజ్యం ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్ల వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

మహిళలదే అగ్రస్థానం

చిత్తూరు కార్పొరేషన్: మహిళలు అగ్రస్థానంలో ఉండాలని సీనియర్ న్యాయవాది నళిని తెలిపారు. నగర మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు ఏదో ఒక మూల మహిళలు వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. సమస్యలను ఎదుర్కొని పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకురాలు కుమారి, జయలక్ష్మి, రమాదేవి కవిత, లతారెడ్డి పాల్గొన్నారు.

కోదండ రామునికి కల్యాణమస్తు!

- శరవేగంగా కల్యాణ మండప నిర్మాణం
- సీజీఎఫ్ నుంచి రూ.97 లక్షలు మంజూరు
- చివరి దశలో నిర్మాణ పనులు
- త్వరలో కోనేరు నిర్మాణానికి శంకుస్థాపన



వేగంగా జరుగుతున్న కల్యాణ మండప నిర్మాణ పనులు



పనుల పరిశీలనలో ఆలయ బృందం

గత ఐదేళ్ల కాలంలో శ్రీ కోదండరామస్వామి ఆలయం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. గతంలో ఆలయ అభివృద్ధి కమిటీలు కానీ, పాలకులు కానీ ఈ ఆలయాన్ని పట్టించుకోలేదు. కొన్నేళ్ల నాటి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తోంది. ఆలయ కల్యాణ మండపం లోటును తీరుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీజీఎఫ్ నుంచి రూ. 97 లక్షలు మంజూరు చేసింది. తద్వారా మండప నిర్మాణ పనులు పరుగులు తీస్తున్నాయి. త్వరలో కోనేరు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆలయ అభివృద్ధిపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని రామునిగుడివీధిలో శ్రీ కోదండరామస్వామి ఆలయం కొన్నేళ్ల నుంచి భక్తుల ఆదరణ చూరగొంటోంది. అయితే ఈ ఆలయం అభివృద్ధికి నోచుకోక కొన్నేళ్లుగా కుంటుపడుతోంది. గత పాలకులు పట్టించుకోకపోవడం, ఆలయ కమిటీలు శ్రద్ధ చూపకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించింది. ఆలయ అభివృద్ధి పనులు ఎక్కడవేసిన గొంగళి అన్న చందాన ఉండిపోయాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆలయ అభివృద్ధికి అడుగులు పడ్డాయి. కొన్నేళ్ల నాటి భక్తుల కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసింది. తొలుత దాతల సహకారంతో ఆలయానికి రథాన్ని సిద్ధం చేసుకున్నారు. తర్వాత కల్యాణ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు, ఇదివరకు పనిచేసిన ఆలయ పాలక మండలి సభ్యులు కలిసి కల్యాణ మండప నిర్మాణం జరిపించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ప్రతిపాదనలు పంపించిన నెలల వ్యవధిలోనే కల్యాణ మండప నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. ఏడాది క్రితం సీజీఎఫ్ నుంచి రూ.97 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు నీవా నది ఒడ్డు నున్న కోదండరామస్వామి ఆలయానికి చెందిన రూ. 90 సెంట్ల భూమిలో అభివృద్ధి పనుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులోని 45 సెంట్ల భూమిలో నాలుగు నెలల క్రితం కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో 20 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. అనంతరం దాతల సహకారంతో మిగిలిన 45 సెంట్ల భూమిలో కోనేరు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందుకు దేవదాయశాఖ నుంచి అనుమతులు లభించాయి. త్వరలోనే ఈ పుష్కరిణి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే కోదండరామస్వామికి ధూప, దీప, నైవేద్య, అభిషేక పూజలు మరింత పెరగనున్నాయి. ఆలయ ఆదాయం వృద్ధి చెందుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆలయ అభివృద్ధి పనులు జరిగాయని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భగవంతుడి ఆశీస్సులతో...



కొన్నేళ్లుగా ఆలయ ఆధీనంలోని భూమిలో కల్యాణ మండపం నిర్మించాలని అనుకుంటున్నాం. భగవంతుడి ఆశీస్సులతో ఏడాది క్రితం ఆ కల నిజమైంది. ఓ పక్క భూమి ఆక్రమణ తొలగడంతోపాటు కల్యాణ మండప నిర్మాణం పూర్తి కావస్తోంది. త్వరలో ప్రారంభోత్సవం చేస్తాం. ఆలయానికి మరింత ఆదాయం చేకూరేలా వృద్ధి చేస్తాం. ఈ కల నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది. కోనేరు నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తాం.

–వేణుగోపాల్, అర్చకులు

ప్రభుత్వం, భక్తుల సహకారంతోనే...



ఎంతో మంది కల్యాణ మండపం కట్టాలని అనుకున్నారు. కానీ ముందడుగు వేయలేకపోయారు. భారీ బడ్జెట్‌తో కూడుకుంది అని వదిలేశారు. ఏడాది క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపించాం. సీజీఎఫ్ నుంచి రూ.97 లక్షలు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న కల్యాణ మండపం నిర్మించాలన్న కోరిక నెరవేరుతోంది. ఈ ఐదేళ్లలో భక్తుల సహకారంతో రథం ఏర్పాటు చేశాం. ఇప్పుడు కల్యాణ మండపం నిర్మిస్తున్నాం. త్వరలో కోనేరు నిర్మాణం జరగనుంది.

–రాజా, మాజీ ఆలయ సభ్యుడు

ఘనంగా పౌర్ణమి వేడుకలు





విశేషాలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి, వళ్లీదేవసేన సుబ్రమణ్యస్వామి

గుడిపాల: మండలంలో 197రామాపురం గ్రామంలో వెలసి ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఆదివారం పౌర్ణమి వేడుకలు పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి కాకడ హారతి సమర్పించారు. ఆపైన ఆలయంలో వెలసిన విగ్రహ దేవతామూర్తులు అందరికీ అభిషేక కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన చేశారు. సాయంత్రం 6గంటలకు వీరబ్రహ్మేంద్రస్వామి వారి అష్టోత్తర శత నామవళి పూజా కార్యక్రమం నిర్వహించి కళశపూజ, చంద్రపూజ నిర్వహించారు. ఉత్సవమూర్తులైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారికి మహారాజరాని అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. కుప్పిగానిపల్లె సమీపంలో ఉన్న కందగిరి శ్రీవల్లి సుబ్రమణేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ప్రేమ్‌కుమార్, ధనలక్ష్మి వారు అన్నదానం చేశారు. సాయంత్రం కుప్పిగానిపల్లె గ్రామం మీదుగా స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించి ఓటు వేయండి

- చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



గుడిపాల: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయానందరెడ్డి

గుడిపాల: పల్లె పల్లెలో అభివృద్ధి చేశాం.. ఆదరించి ఓటు వేయండి అని చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని 189కొత్తపల్లె పంచాయతీలో ఆదివారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడకు వెళ్లినా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లతో పరిపాలనంతా గ్రామాల్లోనే సాగుతోందని వివరించారు. ఇదే కదా అభివృద్ధి అని చెప్పారు. జగనన్న ఇచ్చిన 99శాతం అమలు చేశారని గుర్తుచేశారు. ఏప్రిల్ 9వ తేదీన ఈసారి మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు వివరించారు. దీని కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో జనాదరణ బలంగా ఉందన్నారు. మీ ఇంటికి మంచి జరుగుంటేనే తమకు ఓటెయ్యండని ఒక్క జగన్ తప్ప దేశ చరిత్రలో ఏ నాయకుడూ చెప్పలేదని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ రైతులకు, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని చెప్పి, చివరకు అప్పుల పాలు చేశారని పేర్కొన్నారు. వీటన్నింటినీ గుర్తు పెట్టుకొని ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి మరోసారి జగనన్నను సీఎంగా చేసుకుందామని కోరారు.

నీకు ఢోకా లేదు నాయనా..

ప్రచారంలో భాగంగా 189 కొత్తపల్లె గ్రామంలో ఓ అవ్వ(అన్నపూర్ణమ్మ)ను విజయానందరెడ్డి పలకరించారు. ఏం అవ్వా బాగున్నావా... బాగున్నా నాయనా, నువ్వు ఎలా ఉన్నావు... అవ్వా, ఆరోగ్యం ఎలా ఉంది, పరవాలేదు బాగా ఉంది అని చెప్పింది. ఆ తరువాత 'నువ్వు గెలుస్తావు నాయనా నీకు ఢోకా లేదు' అని చెప్పి ఆయన్ను ఆశీర్వదించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, రజినీకాంత్, మధుసూదన్‌రాయల్, రవియాదవ్, పెరిల్లా, రమేష్, జయకోడి, గుణవతి, విక్టర్, నవీన్, ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, యోవాన్, చిట్టిబాబు, డానియల్, మొగిలిరెడ్డి, రవి, కక్ష్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా, సంపత్, కారిమేఘున్, శివకుమార్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, జానకి రామిరెడ్డి, భాగ్యరాజ్, రీగన్, గౌతమ్, శిలంబరసన్, రవీంద్రారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, గుండుసాయి, విజయ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ చేసిన అభివృద్ధి శూన్యం





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, పాల్గొన్న స్థానికులు

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ పాలనలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి మార్కు ఒక్కటీ లేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి విమర్శించారు. ఇరువారంలో ఆదివారం స్థానికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత పాలకులకు ఇరువారమంటే చిన్నచూపన్నారు. స్థానికులను కూలీలుగా పనికి పెట్టుకొని ఎదగనివ్వకుండా అణగదొక్కేశారని గుర్తుచేశారు. యాదమరి ఎంపీపీ సురేష్ గతంలో తమ సంస్థలో ఉద్యోగి అని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు ఎన్నికల్లో పబ్బం గడుపుకోవాలనే దుర్బుద్ధితో తనపై అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నియోజకవర్గంలో హడావుడి చేసే టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. విజన్ ఉండే నాయకుడిని ఎన్నుకుంటే అందరి జీవితాలు బాగుంటాయని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మహిళలకు జగనన్న ప్రాధాన్యతనిస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్మన్ సరళామేరి, సీనియర్ పార్టీ నాయకురాలు గాయత్రీదేవి అన్నారు. అమ్మఒడి, ఇంటి స్థలాలు, నిర్మాణానికి రుణాలు, ఆసరా ఇలా ఎన్నో పథకాలు ఇచ్చి వారికి ప్రాధాన్యతనిచ్చారన్నారు. మనకు అండగా ఉన్న నాయకులను గెలిపించుకోవాలని ఫ్యాన్‌కు ఓటువేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగజేష్ స్థానిక నాయకులు డేవిడ్, ప్రేమ్, బాలసుబ్రమణ్యంరెడ్డి, సూరిరెడ్డి, మనోహర్, మహి, మదన్, జయకుమార్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే విలువలు నేర్పించండి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు చదువుతోపాటు విలువలను చిన్నతనం నుంచే నేర్పించాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్.కరుణకుమార్ అన్నారు. నగరంలోని హల్లో కిడ్స్ ప్లే స్కూల్ 3 వార్షికోత్సవం వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థులను ఎప్పుడూ చదువు అనే పేరుతో ఇబ్బందులు పెట్టకూడదన్నారు. పిల్లలతో ప్రేమగా మెలగాలని, పోటీతత్వంతో చూడరాదన్నారు. మార్కులే ముఖ్యంగా భావించవద్దన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సుప్రీంకోర్టు అడ్వొకేట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ తరానికి ఏది అవసరమో దానికి అనుగుణంగా పిల్లలను అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. నైపుణ్యంతో కూడిన విద్యను ఆడుతూ పాడుతూ అందిస్తున్న హల్లో కిడ్స్ ప్లే స్కూల్ చిత్తూరు నగరంలో తలమానికంగా ఉందన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న లిటిల్ రోజ్ పాఠశాల చైర్మన్ డాక్టర్ బి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు దూరంగా హాస్టల్‌లో పెట్టి చదివించే ధోరణిని మానుకోవాలన్నారు. అలా చేయడం పిల్లలు పెద్ద అయ్యాక తల్లిదండ్రుల ప్రేమను కోల్పోతారని చెప్పారు. కరస్పాండెంట్ లోహిత్ కుమార్ ఆ పాఠశాలలో విద్యా బోధనను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో అకడమిక్‌లో విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారులకు, ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన తల్లిదండ్రులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం





బంగారుపాళెం: ముంగరమడుగులో ర్యాలీ   చిత్తూరు: ర్యాలీ చేస్తున్న టౌన్‌చర్చి సంఘ సభ్యులు



చిత్తూరు: మట్టలతో ర్యాలీ చేస్తున్న చర్చి సభ్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా టౌన్ చర్చి సంఘ సభ్యులు చర్చి నుంచి గాంధీ విగ్రహం వరకు ప్రత్యేకంగా అలంకరించిన మట్టలతో ర్యాలీ నిర్వహించారు. కరుణామయుడి వేషధారణ ధరించి ఓ భక్తుడు గాడిదపై ఊరేగాడు. సెయింట్ లూక్ చర్చి సభ్యులు చర్చి నుంచి పలువీధుల్లో మట్టలతో ర్యాలీ చేశారు. భజన కార్యక్రమాలతో అలరించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించి మట్టల ఆదివారం ప్రాముఖ్యతను ఉద్దేశించి మతబోధకులు ప్రసంగించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

బంగారుపాళెం: క్రైస్తవ మందిరాలలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంగారుపాళెం, నలగాంపల్లె, ముంగరమడుగు, మాధవ నగర్, తగ్గువారిపల్లె తదితర చర్చిల్లో పలువురు వాక్యోపదేశకులు ఏసుక్రీస్తు పునరుద్దానంపై ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనంతరం గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతులు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో వెలసిన శ్రీకృష్ణ పరమాత్మకు శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊయలలో పరుండబెట్టి ''జోఅచ్యుతానంద జోజోముకుందా.. లాలి పరమానంద రామ గోవిందా జోజో..'' గీతాన్ని ఆలపిస్తూ స్వామిని పవళింపజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఐరాల: క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధిని గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స అందించి ఆరోగ్యం కుదటపడే వరకు నెలకు రూ.500 ప్రభుత్వం ఇస్తుందన్నారు. గ్రామాల్లో క్షయ వ్యాధితో బాధపడేవారిని గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా ఆశావర్కర్లు సహకరించాలని సూచించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే వారి వద్ద కళ్లె(గల్ల) శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ తరువాత వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని, అందువల్ల క్షయ వ్యాధిగ్రస్తులు బయట తిరగకుండా చికిత్స తీసుకుంటే క్షయ వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి ప్రధాన వీధుల్లో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సతో క్షయవ్యాధి దూరం

బంగారుపాళెం: క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడం ద్వారా క్షయవ్యాధి దూరం అవుతుందని స్థానిక వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది, క్షయ నివారణ కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుంచి గ్రామ వీధుల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ ర్యాలీ చేపట్టారు. క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ, క్షయ వ్యాధి బారిన పడిన వారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వ్యాధి ప్రారంభ దశను గుర్తించి క్రమం తప్పకుండా చికిత్స చేసుకుంటే జబ్బు పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. డాట్స్ పద్ధతి ద్వారా 6 నెలల పాటు మందుల వాడితే జబ్బు నయమవుతుందన్నారు. టీబీ సూపర్ వైజర్ శివ కుమార్ మాట్లాడుతూ, క్షయవ్యాధికి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు స్వరూప్, భార్గవ్, అనీల్, డీపీఎంఓ మణి, ప్రకాష్, హరి, భావన, ఐసీటీసీ కౌన్సిలర్ బాబు, హెల్త్ సూపర్ వైజరు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయండి

పూతలపట్టు: క్షయ వ్యాధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో రోగ నిర్ధారణకు చాలా రోజులు పట్టేదని, ప్రస్తుతం అత్యాధునిక విధానాలతో కేవలం రెండు గంటల వ్యావధిలోనే గల్ల పరీక్షతో క్షయ వ్యాధిని గుర్తిస్తున్నారని తెలిపారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా డాట్ చికిత్స పొంది ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణా, సీహెచ్ఓ శ్రీనివాసమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.





ఐరాల: క్షయ నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, వైద్య సిబ్బంది, బంగారుపాళెం: క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

సంక్షేమ సారథికే మళ్లీ పట్టం



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్



యువతకు సంఘీభావంగా ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సునీల్‌కుమార్

- పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునీల్‌కుమార్
- తవణంపల్లెలో నియోజకవర్గ యువజన విభాగ సమావేశం
- బైపాస్ నుంచి ద్విచక్ర వాహన ర్యాలీ

తవణంపల్లె: వైఎస్సార్‌సీపీని గెలిపించి సంక్షేమ సారథి జగనన్నకే మళ్లీ పట్టం కట్టాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పిలుపు నిచ్చారు. పూతలపట్టు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండలంలోని బైపాస్ రోడ్డు నుంచి ఉత్సాహంతో యువకులు నిర్వహించిన భారీ ర్యాలీలో డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం కాణిపాకం రోడ్డులోని నారాయణాద్రి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సునీల్‌కుమార్ ప్రసంగించారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాలు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయించి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. పారిశ్రామికవేత్త మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యువత ఉత్సాహంతోనే వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని అన్నారు. అన్ని పార్టీలు కలిసొచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎవరూ ఢీకొట్టలేరని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కంటే అత్యధికంగా మెజారిటీ సాధించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. అనంతరం సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు.

చంద్రబాబు పాలనలో మొండి చెయ్యి

చంద్రబాబు పాలనలో యువతకు వరాల జల్లు కురిపించి, మొండి చెయ్యి చూపించారని డాక్టర్ సునీల్ కుమార్ ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓట్ల కోసం అబద్ధపు హామీలతో ముందుకు వస్తున్నారని తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు సాయిరెడ్డి, భార్గవ్‌రెడ్డి, తేజారెడ్డి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.